

ఖ్యాతిని శాశ్వతం చేసిన డాక్టర్ జానమద్ది

కడప అర్బన్ : చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ లాంటి తెలుగు భాషాభిమాని గురించి తెలుగు వారికి తెలియేసేందుకు ఆయన పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఆయన ఖ్యాతికి శాశ్వతత్వం కల్పించిన డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి నిజంగా కారణజన్ముడని రచయిత రమణారెడ్డి అన్నారు. గురువారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు అధ్యక్షతన డాక్టర్ జానమద్ది జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఇతర అభిమానులతో కలిసి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. జనార్దన రాజు మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది పేరిట ప్రత్యేక సంచిక వెలువరించే అవకాశం లభించడం తన జీవితానికి అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, రచయిత కల్లూరు బాల ఎల్లారెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి, గంగాధర్, గొబ్బూరి కోటేశ్వరరావు, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-716 రహదారి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్!

రూ.వెయ్యి కోట్లతో ప్రతిపాదనలకు ఆమోదం
10 రోజుల్లో టెండర్ల నిర్వహణకు కసరత్తు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఎట్టకేలకు పులివెందుల-ముద్దనూరు ఎన్‌హెచ్-716 నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి రంగం సిద్ధమైంది. 2022 ఆగస్టులో జాతీయ రహదారుల ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన టెండర్లలో కాంట్రాక్టర్లు రింగ్ అయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం టెండర్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాజాగా జాతీయ రహదారుల ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూ.1,000 కోట్లతో 56 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల నూతన ప్రతిపాదనలు అందజేశారు. దీనికి కేంద్రప్రభుత్వం నాలుగు వరుసల 716 జాతీయ రహదారి నిర్మాణ పనులకు ఆమోదం తెలిపింది. ఈమేరకు జాతీయ రహదారుల ఇంజినీరింగ్ విభాగానికి టెండర్ల నిర్వహణకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈమే రకు జిల్లా జాతీయ రహదారుల ఇంజినీరింగ్ యంత్రాంగం 10 రోజుల వ్యవధిలో టెండర్ల నిర్వహణకు అవసరమైన కసరత్తు చేస్తోంది. 716 జాతీయ రహదారి నిర్మాణ



పనులు చేపడితే పులివెందుల నుంచి ముద్దనూరు మీదుగా హిందూపురం వరకు జాతీయ రహదారి పనులు కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎన్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయభాస్కర్‌రెడ్డిని సంప్రదించగా ఎన్‌హెచ్-716 నెంబర్ గల రహదారి నిర్మాణ పను లకు ఆదేశాలు అందగానే టెండర్లు నిర్వహిస్తామని పేర్కొనడం గమనార్హం.

సాగునీటి ప్రాజెక్టులపై జగన్ శీతకన్ను

జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చా వేదికలో వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో సాగునీటి రంగంపై సీతకన్ను వేశారని, మేజర్, మీడియం, మైనర్ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా 9 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రధాన కాలువలు, ఉపకాలువలు, పంట కాలువలు లేనందున 9వేల ఎకరాలకు కూడా నీరందించలేకపోవడం శోచనీయమని వక్తలు పేర్కొన్నారు. గురువారం జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రెస్ క్లబ్‌లో చర్చా వేదిక నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపనల స్పెషలిస్ట్‌గా మారారని పేర్కొన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు రెండుసార్లు శంఖుస్థాపన చేసి ఒక్క రూపాయి వ్యయం చేయలేదన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడ నిర్వీర్యం అయ్యిందని తెలిపారు. పులివెందుల అసాంఘిక శక్తుల అడ్డాగా మారిందని, జగన్ అభివృద్ధి నిరోధకునిగా చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. కడప-పెండ్లిమర్రి-రాయచోటి-బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి 21.3 కిలోమీటర్లు పూర్తి చేసిన తరువాత జగన్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా రైల్వే శాఖ పనులు ఆపేసిందన్నారు. ఇంతటితో ఆగకుండా కడప - బెంగుళూరు రైల్వే ప్రాజెక్టు అవసరం లేదని ముఖ్యమంత్రి జగన్ రైల్వే బోర్డుకు, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన కారణంగా ఆ ప్రాజెక్టు రద్దయిందని చెప్పారు. తద్వారా జగన్ రాయలసీమ ద్రోహిగా రాయలసీమ ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నుండి విశాఖకు తరిలిస్తే కడప జిల్లాకు రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. కడప జిల్లాలో ఖనిజ సంపద, వృక్ష సంపద సమృద్ధిగా ఉన్నా పారిశ్రామికీకరణ జరగనందున నిరుద్యోగ సమస్య తీవ్రమై వలసలు పెరుగుతున్నాయన్నారు. జిల్లాలో పాలెగాళ్లు, పెత్తందార్ల పెత్తనంతో పేదలు నలిగిపోతున్నారని, సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని తెలిపారు. చట్టబద్ద పాలన కరువైందని, ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కుతున్నారని, వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. ప్రసంగిస్తూ ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో నిధుల కొరత కారణంగా విద్యా ప్రమాణాలు



అభివాదం తెలియజేస్తున్న నాయకులు

పడిపోతున్నాయన్నారు. తెలుగు సూర్యుడుగా ప్రసిద్ధి గాంచిన, యోగివేమనను తెలుగు ప్రజలకు పరిచయం చేసిన సి.పి. బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధిని విస్మరించడం శోచనీయమన్నారు. రాజోలు జలాశయానికి 2019 నుంచి ఒక్కరూపాయి మంజూరు చేయలేదన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థని నిర్వీర్యం చేశారని, విద్వేష రాజకీయాలు పోత్సహిస్తున్నారని వివరించారు. విభజన చట్టం అమలు కోసం కేంద్ర ప్రభుత్వంతోనూ, తెలంగాణ ప్రభుత్వం తోనూ పోరాడలేని నిస్సహాయ స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. అభివృద్ధి ప్రాధాన అజెంగా రాబోవు ఎన్నికలలో ఉండేటట్టు జనచైతన్య వేదిక కృషిచేస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలలో ఆయా జిల్లాల సమగ్రాభివృద్ధిపై చర్చాగోష్టులు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య ప్రసంగిస్తూ పాలకులు వ్యాపారులై ప్రజలు బిచ్చగాళ్ళుగా మారుతున్నారని కడప జిల్లాలో ఉన్న అపార ఖనిజ సంపద, ఎర్ర చందనం అధికార పార్టీ నేతల ధనార్జనకు బలైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి, జనసేన పార్టీ రాష్ట్ర నేత సుంకర శ్రీనివాస్, లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు దేవర శ్రీ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ డాక్టర్ బేరిల్ల శ్రీనివాస్, బహుజన సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సగిల గుర్రప్ప, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నేత కె.లింగమూర్తి, జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు బి. విశ్వనాథ, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పి. శంకరయ్య, పి ఈ టి జిల్లా కార్యదర్శి పి. రమేష్ ప్రసంగించారు.

పాత కలెక్టరేట్ ఆధునికీకరణ హర్షణీయం

కడప అర్బన్ : పూర్వం జిల్లా పరిపాలనా కేంద్రంగా వెలుగొందిన పాత కలెక్టరేట్‌ను ప్రభుత్వం ఆధునికీకరించడం హర్షణీయమని పట్ల రాయలసీమ మన్రో సేవా సమితి అధ్యక్షుడు బిషప్ రెవ డాక్టర్ కె శ్యామూల్ బాబు, దక్షిణ భారత పర్యాటక సంస్థ ప్రధాన కార్యదర్శి జ్యోతి జార్జి హర్షం వ్యక్తంచేశారు. గురువారం పాత కలెక్టరేట్లు మన్రో చిత్ర పటాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం సిద్దవటం జిల్లా కేంద్రంగా ఉండేదని, తరువాత కడప కేంద్రంగా మన్రో పరి పాలన సాగిందన్నారు. పాలెగాళ్ల అణచివేత, రైత్వారి విధానంలో మన్రో చేసిన సేవలు ప్రజల మన్ననలు పొందాయని చెప్పారు. సీమ ప్రజల అభివృద్ధికి మన్రో ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పాత కలెక్టరేట్ ఆధునీకరించాల్సి ఉండేదని, ఆయన లేక పోవడంతో వైఎస్ఆర్ కల కలగానే మిగిలిపోయిందని వాపోయారు .

నిత్యావసరాలు పంపిణీ

కడప అర్బన్ : కేంద్రీయవిద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కడప కెవి వద్ద దసరా కానుకగా 15 మంది కెవి వర్కర్లకు,డ్రైవర్లకు నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కోశాధికారి జితేంద్ర మాట్లాడుతూ కెవి విద్యార్థుల కోసం శ్రద్ధగా, సమయానుకూలంగా శ్రామిస్తున్న వర్కర్లు,డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పండుగలు అందరం కలిసిమెలిసి సుఖశాంతులతో జరుపుకోవాలని, సమాజానికి మంచి సందేశాన్ని అందించాలని పేర్కొన్నారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శివరాం మాట్లాడుతూ కెవి అన్నివిధాల అభివృద్ధి చెందడం కోసం అందరితో సమన్వయంగా ముందుకెళుతున్నామన్నారు. మహిళా విభాగం కన్వీనర్ హిరణ్మయి, రూట్ 1 కన్వీనర్ రమేష్ బాబు,కో - కన్వీనర్ సునీల్ కుమార్, రూట్ -2 కో - కన్వీనర్ గురు భాస్కర్, రూట్ 3 కన్వీనర్ సురేంద్రా రెడ్డి, కో-కన్వీనర్ నరసింహులు, రూట్ 4 కన్వీనర్ గంగాధర్, రూట్ 5 కో -కన్వీనర్ శేఖర్, వెంకట లక్ష్మీ దేవి, జయశ్రీ, అరుణ్, సుబ్బారెడ్డి, నరసయ్య, నరేంద్రా రెడ్డి పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయండి

కడప అర్బన్ : అమెరికా, ఇజ్రాయెల్,ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీల దుర్మార్గం పరాకాష్టకు చేరింది, వీటి దుష్టచర్యల నుంచి పాలస్తీనీలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా శనివారం నిర్వహించబోయే శాంతి ర్యాలీలో పాల్గొని నినదించాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్ని ప్రజా సంఘాలకు, అన్నివర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతు అమెరికా ద్వంద్వ వైఖరిని నిలదీశారు.ఒక వైపు ఇజ్రాయెల్ కు అండగా ఉంటానని చెప్పడం రెండవ వైపు గాజాలో జరిగిన అతి దారుణానికి ఇజ్రాయెల్ కు సంబంధం లేదనడం, గాజాకు ఆర్థిక సహాయం ప్రకటించి తన నీతి మాలిన వైఖరిని బయటపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులను ఆపమని చెప్పకుండా తమాషా చూడడం బైడన్ కే చెల్లిందన్నారు. ప్రపంచ మీడియా ఇజ్రాయెల్ దౌర్జన్యాలను దాచడం దుర్మార్గమన్నారు. అందుకు మానవత్వత్వం ఉన్న ప్రతి ఒక్కరు రాజకీయాల కతీతంగా,కులాలు, మతాలకతీతంగా శాంతి ర్యాలీలో పాల్గొని ఇజ్రాయెల్ దాడులు ఆపేలా కేంద్రం పై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేద్దామని పేర్కొన్నారు.

శిల్పారామంలో దసరా వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని శిల్పారామంలో దసరా ఉత్సవాలను ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్లు శిల్పారామం ఏవో శివ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్పా మూవీ కళాకారుల చేత సాంస్కృతి కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. టీవీ యాంకర్లు, కమెడియన్స్, డాన్స్ మాస్టర్ల చేత ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరారు.

పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి - కడప

సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజాద్‌బాషా తన నివాస క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 12 లక్షల ఎల్ఒసి, రూ. 70 వేల చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదలకు ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బలస్వామి రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు నరపురెడ్డి సుబ్బా రెడ్డి, తోట కృష్ణ, వైఎస్సార్సీపి నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : పిఒ

కడప సిటీ : విద్యార్థులు చదువు తోపాటూ క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 16,17 తేదీల్లో గుంటూరు జిల్లా పేరిచర్ల , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 4వ రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్, కబడ్డీ పోటీలలో అట్లూరు కస్తూరిబా గాంధీ విద్యాలయం, సిద్ధవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు , రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. జట్టులోని విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు. అభినందనలు తెలియజేశారు క్రీడలు మానసికోల్లాసానికి , విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనన్నారు. క్రీడలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలన్నారు కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు చల్లా విశ్వనాథరెడ్డి, జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి విజయలక్ష్మి , కొండా దశరథరామిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వై సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఫణి శ్రీ, పిఇటి ప్రమీల, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ రద్దుచేసి ఒపి ఎస్ పునరుద్ధరించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున కోరారు. గురువారం సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రకటించిన జీపీఎస్ ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. 11వ పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లించి, 12వ పిఆర్సికి సంబంధించి ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని కోరారు. ఇంతవరకు పెండింగ్ డిఎలుచెల్లించలేదని పేర్కొన్నారు. దసరాకు ఒక డిఎ ఇస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారని, ఇంతవరకు ఏ చర్యలు తీసుకోలేదని చెప్పారు. మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు జాప్యం చేస్తున్నారని, సంపాదిత సెలవులు, నగదు రూపేణా తీసుకోవడానికి పెట్టిన బిల్లులు దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు పరిష్కరించలేదని తెలిపారు. ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య భావన ఉన్నదని, దానిని విడనాడాలని కోరారు సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి. సుదర్శన్ బాబు, మేంద్రగుత్తి గంగరాజు, కార్యదర్శులు కట్టా గంగాధర్, జయరాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ ఇస్తారా..గద్దె దిగుతారా..?

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ నిలదీత
- పాత పెన్షన్ సాధనకై యుటిఎఫ్ భవన్‌లో 'నిరవధిక నిరాహార దీక్షలు' ప్రారంభం



దీక్షల ప్రారంభంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తారా ! గద్దె దిగుతారో ! రాష్ట్ర ప్రభుత్వం తేల్చుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. సిపిఎస్, జిపిఎస్, విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యుటిఎఫ్ భవన్‌లో గురువారం నిరవధిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, సహాధ్యక్షుడు వై.రవికుమార్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సి.సుదర్శన్ దీక్షలో కూర్చున్నారు. దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఒబుల్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సిఐటియు పట్టణ కార్యదర్శి పి.సుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తన పాదయాత్రలో ఉద్యోగులకు అండగా ఉంటానని అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ గద్దెనెక్కగానే ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించడం దుర్మార్గమన్నారు. తాను అధికారంలోకి వస్తే వారంలోపే రద్దు చేస్తానన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయకపోగా మరో ప్రమాదకరమైన జిపిఎస్ విధానాన్ని అమలు చేయడం జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ కే చెల్లిందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమేనా మీ ప్రభుత్వ విశ్వసనీయత అని ముఖ్యమంత్రిని నిలదీశారు. సిపిఎస్ రద్దుపట్ల హామీ ఇవ్వని అనేక రాష్ట్రాలు సిపిఎస్ ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే మాట ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాట తప్పడం, మడమ తిప్పడం ఏంటని వారు నిలదీశారు. పాత పెన్షన్ అమలు కోసం మొక్కవోని దీక్షతో పోరు సల్పుతున్న యుటిఎఫ్ ఉద్యమాలకు బాసటగా నిలుస్తామని వారు పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తామని, అధికారంలోకి వచ్చిన వారంలోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నిజమని నమ్మి ఉద్యోగ, ఉపాధ్యాయులు నిలువునా దగాపడ్డారని ఆరోపించారు. ఉద్యోగులను అన్ని రకాలుగా వంచించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, హిమాచల్, పంజాబ్ ఇతర రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం పాత పెన్షన్ అమలు ఆర్థిక భారమంటూ తప్పుడు ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రకటనలో వాస్తవం ఉంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై శ్వేత పత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే తమ డిమాండ్ ను రాజకీయ డిమాండ్ గా మారుస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో పాత పెన్షన్ ఇచ్చే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలుంటాయని వారు పేర్కొన్నారు. ఓట్ ఫర్ ఓపిఎస్ అనే నినాదంతో ముందుకు సాగుతామని వారు తెలిపారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి చేపట్టిన దీక్ష పట్ల ప్రభుత్వం దిగి రాకుండా, మొండిగా వ్యవహరిస్తే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ దీక్షలకు మద్దతుగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల వారితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడా మోసం చేయడంలో ఈ ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు. పెన్షన్ అనేది ప్రభుత్వం ఉద్యోగికి ఇచ్చే భిక్ష కాదని, అది ఉద్యోగి హక్కు అని ఆయన పేర్కొన్నారు. పాత పెన్షన్ సాధన కోసం ఉద్యోగ ఉపాధ్యాయులు చేపట్టిన పోరాటాలకు యుటిఎఫ్ చేసే పోరాటంలో తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.ఐబ్బుల్లా, ఎస్.టి.యు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున, జిల్లా అధ్యక్షులు గంగరాజు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు కె.రమేష్ యాదవ్, ఎస్ఎవిఎ జిల్లా కార్యదర్శి సనిలి రాజేంద్ర, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, నాయకులు షాకీర్ లు మద్దతుగా పాల్గొని ప్రసంగించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, కె.చెన్నయ్య, ఎస్.ఎహ్‌సాన్ అహ్మద్, డి.కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, సిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ అయ్యవారు రెడ్డి, అంధ ఉపాధ్యాయుల ప్రాతినిధ్యం, నాగ సుబ్బయ్య, మహిళా నాయకులు రాజ్యలక్ష్మి, శశిరేఖ, మేరి జయశీల, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి వ్యాపారుల ఆర్థికవృద్ధే 'జగనన్న చేదోడు' లక్ష్యం

- ఇన్‌ఛార్జి కలెక్టర్ జి.గణేష్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

షాపులున్న రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ వృత్తి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా.. రాష్ట్ర ప్రభుత్వం "జగనన్న చేదోడు" పథకాన్ని అమలు చేస్తోందని జెసి, ఇన్‌ఛార్జి కలెక్టర్ జి. గణేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరు బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4వ విడత 'జగనన్న చేదోడు' లబ్ది మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి రూ.10 వేల మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. కలెక్టరేట్ హాలులో 'జగనన్న చేదోడు" పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా.. షాపులున్న 16,158 మంది నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్ల కుటుంబాలకు 4వ విడతగా మంజూరయిన రూ.16,15,80,000 ల మెగా చెక్కును గౌరవ అతిధులతో కలిసి. ఇన్‌ఛార్జి కలెక్టం , బీసీ కార్పొరేషన్ ఈడి డాక్టర్ బ్రహ్మయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి చివరి వ్యక్తికి "జగనన్న చేదోడు" పథకం ద్వారా లబ్ది చేకూరలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశం అన్నారు. షాపులుండి చిన్నపాటి, వృత్తిపరమైన వ్యాపారాలు చేసుకునే బలహీన వర్గాలైన నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్ల కుటుంబాలు కోవిడ్ లాక్ డౌన్ సమయంలో ఆర్థికంగా నలిగిపోయిన పరిస్థితులు గమనించమన్నారు. అలాంటి సమయంలో ప్రభుత్వం అమలు చేసిన 'జగనన్న చేదోడు' పథకం ద్వారా అందజేసిన రూ.10 వేల మొదటి, రెండవ విడత సాయం కోవిడ్ విపత్కర సమయంలో వారికి ఎంతో ఉపకరించిందన్నారు. ఆ పరిస్థితులను అధిగమించి ప్రస్తుతం నాలుగవ విడత సాయాన్ని కూడా ప్రభుత్వం అందించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. జిల్లా బిసి కార్పొరేషన్ ఈడి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డా.వి.బ్రహ్మయ్య మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి "జగనన్న చేదోడు" పథకం మూడవ విడత సాయం ద్వారా జిల్లాలో షాపులు ఉన్న 16,158 మంది టైలర్లు, రజకులు, నాయి బ్రాహ్మణుల కుటుంబాలు లబ్ది పొందాయన్నారు. వీరందరికీ కలిపి మొత్తం రూ.16.15 కోట్ల సాయం అందిందన్నారు. ఇందుకోసం వాలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించి.. రాజకీయాలు, పార్టీలకతీతంగా అర్హులైన నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లను లబ్ధిదారులుగా ఎంపిక చేశామన్నారు. ఏవైనా ఇబ్బందులు కారణంగా ప్రస్తుతం లబ్ది పొందలేని వారు ఉంటే సచివాలయ వాలంటీర్ల ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని, సంబందిత వివరాల కోసం జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, రాష్ట్ర పూసర్ల, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ కుమారి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ టి.పి.వెంకట సుబ్బమ్మ, రాష్ట్ర ఈడీగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, ఎపిటీడీసీ డైరెక్టర్ ఎల్. జయన్న హాజరయ్యారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల కల్చరల్ కమిటీ విభాగం ఆధ్వర్యంలో నూతన బి.టెక్ విద్యార్థులకు ఆరాబ్ద్ -2క23 ఫ్రెషర్స్ డే ని కళాశాల సభా సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ బిటెక్‌లో ప్రవేశం కళాశాల ఎంపిక ప్రధానమని, నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యను కాలాన్ని సద్వినియోగం చేసుకొని స్నేహ భావంతో మెలగాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకని క్రమ శిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ జీవితంలో ఫ్రెషర్స్ డే చిరస్మరణీయమని తెలిపారు. నాలుగు సంవత్సరాలు కళాశాల వనరులను ఉపయోగించుకుని అంకితభావం, పటిష్ట ప్రణాళికతో పట్టుదలతో తల్లిదండ్రుల ఆశయా లను నిలబెట్టి,సమాజంలో ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యం వైపు దృష్టి పెట్టి బలాలు, బలహీనతలు అంచనా వేసుకుని ప్రతిభ చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పీ.ప్రేమ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, డీన్లు,కల్చరల్ కమిటీ సమన్వయ కర్త వీర శంకర్,హ్యూమన్ రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్ లీనా రస్థాపూర్, బోదన,బొదనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులు

కెవికెను సందర్శించిన రైతులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని కృషి గురువారం రైతులు సందర్శించారు. కెవికె, డ్వామా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా వారు సందర్శించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయ కర్త డాక్టర్ . ఎ. వీరయ్య మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రంలో ఊటుకూరు ద్వారా క్షేత్ర పరిశీలనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలు, సాముహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలు, సందర్శనలు వంటి విస్తరణ సేవలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.మహేష్ బాబు, శిల్పకళ,సాయి మహేశ్వరీ, మానస, స్వామి చైతన్య, బద్వేల్, సిద్ధవటం,అట్లూరు, బి. మఠం, కోడూరు మండలాలకు చెందిన వాటర్ షెడ్ ప్రాజెక్ట్ రైతులు పాల్గొన్నారు.

బంగారు దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రొద్దుటూరు : పట్టణంలోని బంగారు దుకాణాలపై సెంట్రల్ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలోని బుశెట్టి జువెలర్స్, శ్రీ గురురాఘవేంద్ర జువెలర్స్, తల్లం సాయిజువెలర్స్, దుకాణాతో పాటు ఇంకా సుమారు 15 దుకాణాలలో 50మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ప్రతి దుకాణం వద్ద సెంట్రల్ నుంచి పోలీసులు పహారా కాశారు. లోనికి ఎవ్వరినీ అనుమతించలేదు. పోలీసులు రాత్రి బాగా పొద్దుపోయే వరకు తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి : వ్య.కా.స

కాశినాయన : మండలంలోని అక్కిమ్‌గుండ్ల పొలంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన భూ కబ్జాదారుడైన శ్రీనివాసులు రెడ్డికి అండగా ఉంటున్న ఎస్ఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రామచంద్రుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కిమ్ గుండ్ల పొలంలో దళితులపై దాడి చేస్తున్న శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోకుండా దళితులను స్టేషన్‌కు పిలిపించి వారిపై కేసును నమోదు చేస్తానని బెదిరించడం సరైందని కాదని వాపోయారు. శ్రీనివాసరెడ్డి, అతని అనుచరులు మందు తాగి రెండు రోజుల కిందట వెంబడి పోలయ్య అతని తల్లిపై దాడి చేశారని, ఫిర్యాదు చేస్తే ఏమాత్రం పట్టించుకోకుండా దళితులపైనే కేసు నమోదు చేస్తానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుంచి అక్కడ దళితులు భూములు సాగు చేసుకుంటుంటే శ్రీనివాసులు రెడ్డి, దొంగ పట్టాలు తీసుకొచ్చి దౌర్జన్యం చేస్తున్నారని , పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఏమాత్రం విచారించకుండా ఎస్ఐ దళితులను బెదిరించడం ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అని జిల్లా అధికారులు దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట


చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రైతు భరోసా కేంద్రాల నిర్మి స్తున్నారని రాష్ట్ర వ్యవ సాయ సలహాదారుడు ఇరగమ్ రెడ్డి తిరుపాల్రెడ్డి, కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం చెన్నూరు మైనార్టీ కాలనీలో రూ. 22 లక్షలతో నిర్మించిన నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రైతులు పట్టణాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రం నిర్మిస్తున్నారని తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చీర సురేష్ యాదవ్, మండల కన్వీనర్గన్ భాస్కర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, నిత్య పూజయా, అధికారులు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, తహశీల్దార్ పటాన్ అలీఖాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్

యాచకులకు దుప్పట్లు, మిఠాయిలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇడమడక మాజీ సర్పంచ్ తాటి సుబ్బరాయుడు భార్య తాటి సంజమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం వీరి కుమారుడు మాజీ కౌన్సిలర్ తాటి శ్రీనివాస్ యాదవ్, కుమార్తెలు ఇడమడక సర్పంచ్ చింతలపూడి నర్సమ్మ, ఆదిపుల సుజాతమ్మ వైఎంఆర్ కాలనీ సాయి బాబా గుడి వద్ద దాదాపు 50 మంది యాచకులకు దుప్పట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఏదోక కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది చలికాలంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

గడపగడపకూ సంక్షేమం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గడపగడపకూ సంక్షేమాన్ని అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నగిరిగుట్టలో గురువారం వైఎస్ మనోహర్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయీ డైరెక్టర్ హాఫ్ గంగాధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హాఫిజ్, నాయకులతో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, ఎంత లబ్ది పొందారో ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని నాయకులు తెలిపారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి నాయకుడ్ని మళ్లీ మనం ముఖ్యమంత్రిగా చేసుకోవటానికి పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కిషోర్, సుజాత, గుల్జార్, నాయకులు వేదంగుల చంద్రమౌళి, అరకటవేముల దేని, పద్మనాభరెడ్డి, సంపత్, డేనియల్, సిద్ధయ్య, ఓబులేసు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నిధులు, సంక్షేమ ఫలాలు అందేవరకూ పోరాటం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్రంలో తమ ఓటర్లు 20లక్షల మంది ఉన్నారని, తమకు రావలసిన నిధులు, సంక్షేమ ఫలాలు అందేవరకూ పోరాడుతామని నూర్‌బాషా దూదేకుల నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో నూర్‌బాషా దూదేకుల ఆత్మీయ సమావేశాన్ని గురువారం ఎంఎల్ఎంకే కళ్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నూర్‌బాషా దూదేకుల, ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడు రసూల్ మాట్లాడుతూ తమకు ఎలాంటి రాజకీయ స్థానం కల్పించలేదన్నారు. ఇటీవల కాలంలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ స్థానాల్లో దూదేకుల కులానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. తమ దూదేకుల కులంలో ఏ చిన్న సమస్య వచ్చినా తాను ముందుండి పోరాడి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాయపాటి దస్తగిరి, దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎఎస్‌పి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎఎస్‌పి ప్రేరణకుమార్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక శబ్దాలతో నడిపే మోటార్‌సైకిళ్ల సైలెన్సర్లను గురువారం సాయంత్రం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రోడ్‌రోలర్‌తో తొక్కించారు. అనంతరం వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ ఎవరైనా మద్యం సేవించి, అధిక శబ్దాలతో వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక చర్యలు తీసుకుని కేసులు పెట్టామన్నారు. 20రోజులుగా సుమారు 50 మందిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పెట్టామన్నారు. ట్రాఫిక్ సి.ఐ. యుగంధర్ మాట్లాడుతూ శిక్షపడితే జీవితం నాశనమవుతుందన్నారు. ఇది మొదటి సారిగా భావించి కౌన్సెలింగ్ చేస్తున్నామని, పునరావృతమైతే అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సి.ఐ.లు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణ యాదవ్, పోలీసులు పాల్గొన్నారు.


సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న రోడ్‌రోలర్

షెడ్డు ప్రజలకా.. కారుకా?

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నూతన మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పన్నుల కౌంటర్ ముందు మొన్నటి వరకు ప్రజలు ఎండలో నిలబడి పన్నులు కట్టే పరిస్థితి. మండుటెండల్లో నిలబెట్టి ప్రజల చేత పన్నులు కట్టించుకుంటున్నారంటూ పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించారు. నగర పంచాయతీ కార్యాలయం ఆరుబయట షెడ్డు నిర్మాణాన్ని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు రేకులతో షెడ్డు నిర్మించారు. కానీ రేకుల షెడ్డులో ప్రతిరోజు తన సొంత కారును పార్క్ చేస్తున్నారు. షెడ్డు నిర్మాణం పన్నుల కట్టేందుకు వచ్చే ప్రజలకా.. లేక కారుకేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పన్నుల కౌంటర్ వద్ద చైర్మన్ కారు పార్క్ చేయడంతో వచ్చిన ప్రజలకు అక్కడ అసౌకర్యంగా ఉంటోంది. తన సొంత అవసరాల కోసం ఏర్పాటు చేసిన షెడ్డును ప్రజలకు ఏదో మేలు కలిగేలా నిర్మించామంటూ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు గుసగుసలాడుతున్నారు.


పన్నుల వసూలు కౌంటర్ ముందు ఉన్న షెడ్డులో పార్కింగ్ చేసిన కారు

విద్యుదాఘాతంతో అన్న.. రోడ్డు ప్రమాదంలో తమ్ముడు మృతి

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు.. గంజికుంటలో విషాదఛాయలు


నరేంద్ర మృతదేహం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజేష్

ప్రజాశక్తి - చాపాడు

గంటల వ్యవధిలో అన్నదమ్ములు మృతి చెందడంతో మైదుకూరు మండలం గంజికుంట గ్రామంలో గురువారం విషాదఛాయలు నెలకొన్నాయి. బాధితుల బంధువులు అందించిన వివరాల ప్రకారం.. గంజికుంట గ్రామానికి చెందిన పామిలేటి రాజాకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమార్తెకు వివాహం కాగా.. పెద్ద కుమారుడు నరేంద్రకుమార్ గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తున్నాడు. చిన్న కుమారుడు రాజేష్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గురువారం గ్రామ సమీపంలోని తమ పంట పొలంలో విద్యుత్ లైన్‌కు మరమత్తులు చేసేందుకు నరేంద్ర(28) విద్యుత్ స్తంభంపై ఎక్కి షాక్‌కు గురై మృతి చెందాడు. అన్న మృతి విషయం తెలుసుకున్న తమ్ముడు రాజేష్ (23) హైదరాబాద్ నుంచి బైక్‌లో గంజికుంటకు వస్తుండగా శంషాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కుమారులిద్దరూ గంటల వ్యవధిలో మృతి చెందడంతో తల్లిదండ్రులు శోక సముద్రంలో మునిగిపోయారు. ఈ దుర్ఘటనతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. అన్నదమ్ముల మరణవార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నరేంద్ర మృతదేహాన్ని మైదుకూరు పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేపై ఎలాంటి వ్యక్తిగత కక్ష లేదు : ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై తనకు ఎలాంటి కక్ష లేదని, ప్రజల తరపున స్థాని కంగా జరిగే అక్రమాలను ప్రశ్నిస్తున్నానని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలి పారు. స్థానిక టిబి రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఎప్పుడేగానీ, ఎక్కడేగానీ ఎమ్మెల్యే స్థాయి దిగజార్చి మాట్లాడలేదన్నారు. ఆయనే తన స్థాయిని దిగదార్చుకున్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరుకు ఎమ్మెల్యేలుగా చాలామంది పనిచేశారని, ఎవరి హాయంలో కూడా ఇంత అరా చకాలు జరగలేదన్నారు. దోమలులేని ప్రొద్దుటూరు చేస్తానని ఎమ్మెల్యే ఇంత వరకు ఆ పని చేయలేదన్నారు. దుమ్ము, ధూళి గుంతల ప్రొద్దుటూరును చేశా రన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అబద్ధపు హామీలు, ఆగిన అభివృద్ధి, అరాచకాలు-దౌర్జన్యాలు, అవినీతి ప్రొద్దుటూరు ప్రజలకు ఎమ్మెల్యే ఐదు అంశాలపై వివరణ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఈ ఐదు అంశాలపై ఒక్కో ప్రెస్‌మీట్‌లో ఒక్కోదాని గురించి ప్రజలకు వివరిస్తానని తెలిపారు. ప్రొద్దుటూరు ప్రజలపై ఎమ్మెల్యేకు ప్రేమ ఉంటే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇబ్రహీంను మార్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు ఆపేందుకు 3 నెలల సమయం ఎందుకని, మూడు రోజులు చాలవా అని ఆయన ప్రశ్నించారు. అక్రమ కేసులకు భయపడి వెనక్కి తగ్గే వాడిని కాదని ప్రశ్నిస్తూ ముందుకు వెళ్తానన్నారు.

బలిజలు వైసిపి వైపు అనడం అవాస్తవం

ప్రజాశక్తి - వేంపల్లె


టిడిపి మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర

పులివెందులలో బలిజ కులస్తులంతా వైసిపి వైపు ఉన్నారని చెప్పడం అవాస్తవమని టిడిపి మండల ఉపా ధ్యక్షుడు పసుపు లేటి వీరభద్ర పేర్కొ న్నా రు. గురు వారం ఆయన విలే కరులతో మాట్లా డుతూ టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీం ద్రనాథ్‌రెడ్డి శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి పులివెందుల గంగమ్మతల్లి దేవర గురించి మాట్లాడారని తెలిపారు. బిటెక్ రవి మాటలకు బలిజలు అందరూ స్పందించారని చెప్పారు. వైఎస్ కుటుం బంతోనే బలిజలకు మేలు జరిగిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. వేంపల్లె పట్టణంలో దాదాపు 30 శాతం మేరకు బలిజ కుటుంబీకులు ఉన్నారని, వీరిలో దాదాపు నిరుపేద కుటుంబాలే ఎక్కువ మంది ఉన్నట్లు చెప్పారు. అన్ని వర్గాల వారికి ఆయా కమ్యూనిటీ కళ్యాణ మండపాలు ఉండగా బలిజ కమ్యూనిటీకి సంబంధించి లేకపోవడం దురదృష్టకరమన్నారు. వైఎస్ కుటుంబానికి ప్రేమ ఉంటే బలిజ కులస్తుల కోసం ఎందుకు కమ్యూనిటీ హాలు నిర్మించలేదని ప్రశ్నించారు. ఇకనైనా వేంపల్లె వైసిపి నాయకులు మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిపై బురదజల్లే రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు.

వాస్తవాలు తెలుసుకునే బీటెక్ రవి మాట్లాడారు

పులివెందుల టౌన్ : వాస్తవాలు తెలుసుకునే బీటెక్ రవి సోమవారం మాట్లాడారని పులివెందుల టిడిపి బలిజ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ పులివెందుల బలిజ ఆత్మగౌరవం కోసమే వాస్తవాలు తెలుసు కాబట్టి నిర్భయంగా మాట్లాడారని తెలిపారు. పులివెందుల గ్రామ దేవర ఉత్సవం పూర్వకాలం నుంచి కొనసాగుతోందని, ఇందులో భాగంగా స్థానిక బలిజ సంఘం సమీపంలో ఉన్న అమ్మవారి వద్ద నుంచి దేవర ప్రారంభమై అమ్మవారి శాల, అమ్మవారి శాల సమీపంలో ఉన్న గంగమ్మ దేవత ముక్కలు తీర్చుకొని, అనంతరం అంకాలమ్మ దేవస్థానం వరకు చేరుకుంటారని తెఇపారు. ఈ సందర్భంగా ఇక్కడ సిరిబండి ఏర్పాటు చేస్తార న్నారు. ఈ కార్యక్రమాన్ని యధావిధిగా పూర్వం ఎలా గ్రామోత్సవం నిర్వహిస్తారో అలాగే నిర్వహించాలని బీటెక్ రవి పేర్కొన్నారని, దీంట్లో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల సీనియర్ టిడిపి నాయకులు బొల్లు విజయభాస్కర్, బొల్లు శ్రీనివాస్, తుపాకుల ప్రసాద్, నంబూరు నరసింహులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వరికూటి ఓబుల్‌రెడ్డి

రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్న ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి నిరాధారమైన ఆరోపణలతో రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని 4వ వార్డు కౌన్సిలర్ వరి కూటి ఓబులరెడ్డి అ న్నారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మా ట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు నాయ కత్వంలో తమ వైపు ఎలాంటి దోషం లేకపోవడంతో పోలీస్ అధికారులను కలిసి ప్రొద్దటూరులోని అసాంఘిక కార్యక్రమాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.. శాంతియుతంగా అభివృద్ధి, సంక్షేమం వైపు నడుస్తున్న ప్రొద్దుటూరును ఎలాంటి ఆధారాల్లేని అబద్దాలతో రెచ్చగొట్టి అశాంతిమయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

చిన్నదండ్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్న దం డ్లూరు సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి బ్రహ్మయ్య పేద ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎంపిడిఒ రహమతుల్లయ్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు సాయి చరితారెడ్డి, పద్మావతి, స్పెషలిస్ట్ డాక్టర్లు కిషోర్, వినయ్, వీఆర్వో మల్లికార్జున, అధికారులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న బ్రహ్మయ్య

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజా దర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. గురువారం పులివెందులలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని సంబంధించిన అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా ద్వారా మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి గడపకూ జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతివారికి సంక్షేమ పథకాలు తప్పక అందుతాయని పేర్కొన్నారు. ఆర్‌టిపిపిలో ఉద్యోగ అవకాశాలున్నాయని ఉద్యోగం ఇప్పించాలని ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ ఆర్‌టిపిపిలో ఎలాంటి ఉద్యోగావకాశాలు లేవన్నారు. ఎవరో చెప్పిన మాటలు నమ్మ వద్దన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కోట కింద ఉద్యోగ అవకాశాలున్నాయని కొంతమంది వ్యక్తులు మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తారని నమ్మవద్దన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

సిబ్బందికి ఆర్‌జెడి సూచనలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రికార్డులను గురువారం ఆర్‌జెడి డాక్టర్ నాగ లింగారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2022-23 విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలు, కళాశాల సిబ్బంది హాజరు పట్టికను, అధ్యాపకులకు సంబం ధించిన సమాచారంపై ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవనాల స్థితిగతులపై కూడా ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులును అడిగి తెలు సుకున్నారు. కళాశాలలో మొదటి సారిగా నూతనంగా ప్రవేశపెట్టిన సింగల్ మేజర్ సబ్జెక్టుల వివరాలను అడిగి, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి కళాశాల సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మహేష్‌రావు, గంగాధర్, సుబ్బారెడ్డి, రమేష్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జెడి నాగలింగారెడ్డి

జెఎన్‌టియు ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

జెఎన్‌టియు అనంతపురం వారు విడుదల చేసిన ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక సిబిఐటి కలశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఇందులో సియస్‌ఈ విభాగానికి చెందిన బి.చైతన్యశ్రీ 90.31శాతం, జె.మమత 88.75, యస్.శరణ్యరెడ్డి 86.88, ఈసిఈ విభాగానికి చెందిన ఎ.నాగదీప్తి 87.31, యం.ప్రసన్న 86.13శాతం, యస్.దివ్య 85.16, ట్రిపుల్ ఇ విభాగానికి చెందిన యస్.హరికృష్ణ 91.61, యం.లావణ్య 88.28, కె. మహాలక్ష్మి 87.53, యం. వాసవి 87.53, సివిల్ విభాగానికి చెందిన యస్.షహీన్ 82.69, మెకానికల్ విభాగానికి చెందిన కె.కళ్యాణ్‌బాషా 84.27శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ కళాశాల విద్యార్థులు సాధించిన ఈ ఫలితాల పట్ల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్య మని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. మండలంలోని గురిజాలలో గురువారం ఆయన బాబుతో నేను అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించి జైలు పాల్జేశారన్నారు. రాష్ట్రంలోని ప్రజలు అన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమని తెలిపారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ అజ్జుగుట్ట రవితేజరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, కడప పార్లమెంటు బిసి సెల్ ఉపాధ్యక్షుడు మురళి యాదవ్, నాయకులు కందుల ఓబుల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రశాంత్, అంకన్న, ఖుషి పాల్గొన్నారు.


బాబుతో నేను కార్యక్రమంలో బీటెక్ రవి

అధ్వానం.. సోమాపురం ఎస్‌సి కాలనీ దారి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సోమాపురం నుంచి ఎస్‌సి కాలనీ వెళ్లే రహదారి చాలా అధ్వానంగా తయారైంది. తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర రాళ్లు బయటపడ్డాయి. రహదారి వెంబడి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గత ఏడాది క్రితం మైత్రాయపల్లి, ఆనందా ఆశ్రమం రోడ్డు నూతనంగా నిర్మించే సమయంలో ట్రాక్టర్లు, లారీలు ఈ మార్గాన అధికంగా ప్రయాణించాయి. దీంతో రోడ్డు బాగా దెబ్బతింది. కొన్ని ప్రదేశాల్లో భారీ వాహనాల తాకిడికి కంకర రాళ్లు బయటపడి గుంతలు ఏర్పడ్డాయి. ఎస్‌సి కాలనీ వాసులు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు. ప్రస్తుతం వివి కొట్టాలు మీదుగా మైదుకూరు పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. సోమాపురం మీదుగా రోడ్డును ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. సచివాలయానికి, రేషన్ బియ్యానికి కాలనీ వాసులు ఈ మార్గంలో ప్రయాణించాల్సి ఉంది. కాబట్టి రోడ్డుకు గుంతలు లేకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE : KADAPA
I.A.No. 851/2023
A.S.No. 83/2016

Thota Nagaraju, S/o Venkata Swamy, aged about 65 years, Hindu, Retired Lecturer, resident of D.No.2/668, Sree Hari Rao Street, Nagarajupet, Kadapa City. **...Petitioner/Appellant**

Vs

1) S.Hari Narasimhulu Naidu, Having Died His Lr's No.2&3.
2) S.Harshasimha, S/o Late S.Hari Narasimhulu Naidu, aged about 36 years, Hindu, resident of D/No.484-1-6-18, Vivekananda Nagar, Kadapa City.
3) S.Krsihna Durga, D/o Late.S.Hari Naramhulu Naidu, Aged about 34 years, Hindu, Resident of D/No.39/484-1-6-18, Vivekananda Nagar, Kadapa City.

...Respondents/Respondents

NOTICE TO RESPONDENTS NO2 AND 3

పై తెలిపిన I.A. No.851/2023 నందు Respondent No.2 and 3లో అయిన మీరు హాజరు అగుటకు గాను 16.11.2023వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున Respondent No.2 and 3 అయిన మీరు పై తెలిపిన రాజశ్రీ కోర్టు వారు ఎదుట 16.11.2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై మీకు ఏమైన అభ్యంతరములు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షంతో కేసు తీర్మానించబడును.

//By the Order of the Court//
T. SUBRAMANYAM
Advocate,
Kadapa.

రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు నందు, ప్రొద్దుటూరు
ఓ.ఎస్.నెం 321/2020

జి.శ్రీకాంత్ 34 సం.లు తండ్రి జి.చిన్నవెంకట సుబ్బయ్య, హిందూ,వ్యాపారం,ఇంటి నెం.26/587, వసంతపేట, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం-516360, వైఎస్ఆర్ కడప జిల్లా, ఏ.పి. **...వాది**

వర్సెస్

జక్కా లక్ష్మినారాయణ చనిపోయినందున వారసులు
1.జక్కా జ్యోతి. 2.జక్కా వరలక్ష్మి 3.జక్కా లత. 4.జక్కా రాజేష్ **...ప్రతివాదులు**

దావా సమన్లు మరియు పిటిషన్ నోటీసు

టు,
డి2: జక్కా వరలక్ష్మి, 42 సం॥లు, తండ్రి కీ.శే.జక్కా లక్ష్మి నారాయణ, హిందూ, గృహిణి
డి3: జక్కా లత, 38సం॥లు, తండ్రి కీ.శే.జక్కా లక్ష్మి నారాయణ, హిందూ, గృహిణి
డి2 అండ్ డి3 సాకిన్ ఇంటి నెం.26/937-2 రామేశ్వరం నుంచి బొల్లవరం రోడ్డు,ప్రొద్దుటూరు,వైఎస్ఆర్ కడప జిల్లా, 516360.ఏ.పి.

పై వాది కీ.శే.జక్కా లక్ష్మినారాయణ వాదికి బాకీ పడి అతని పేరిట ఇచ్చిన చెక్కుల రిత్యా రూ.4,16,000 బాకీని అతని ఎస్టేట్ ద్వార రాబట్టుట నిమిత్తం మీ అందరి పైన పై దావాను దాఖలు చేయగా అట్టి దావాలో మరియు ఐ.ఎ.నెం.526/2020 అటాచ్‌మెంట్ పిటిషన్‌లో మీరు పై కోర్టు నందు 30.10.2023వ తేది ఉదయం గం.10.30ని.లకు హాజరయ్యి మీ అక్షేపణలు తెలుపుకోవలెను.లేనంతట మీ పరోక్షమున పై దావా తీర్మానించబడును.

వాయిదా తేది: 30-10-2023

//కోర్టు ఉత్తర్వుల మేరకు//
వి.రమేష్‌బాబు
అడ్వకేట్, ప్రొద్దుటూరు

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI
C.R.P. NO. 2802 OF 2015

BETWEEN:
Manchikanti Pedda Rangaiah Setty, S/o. Mudava Rangaiah, aged about 47 years, Hindu, Business, R/o. Vadurla Bazar, Proddatur, Kadapa District and 2 others. **...Petitioners**

AND

The Proddatur Muncipality, Rep. by its Municipal Commissioner, Municipal Office, Proddatur, Kadapa District and 10 others. **...Respondents**

NOTICE TO:
1. Basireddy Venkata Siva Reddy, S/o. Venkata Subba Reddy, aged about 30 years, Hindu, Business, R/o. 26/119 Netaji Nagar, Proddatur, Kadapa District.
2. Talari Mark, S/o. Devanandam, aged about 42 years, Hindu, Employee, residing at 24/669, Netaji Nagar, Proddatur, Kadapa District.
3. Settipalli Prabhakar, S/o Danam, Aged about 35 years, Hindu, Employee, R/o. D. No. 24/688, Netaji Nagar, Proddatur, Kadapa District.
4. Biyyam Setty Sreenu, S/o not known to the Petitioners, Aged about 45 years, Hindu, employee, R/o. D.No. 24/687A, Netaji Nagar, Proddatur, Kadapa District.
5. Posa Sai, S/o. Late Posa Mallanna, Aged about 30 years, Hindu, R/o. D.No. 24/685, Netaji Nagar, Proddatur, Kadapa District.
6. Chintala Suguna, D/o. Late Chintala Babu, Aged about 30 years, House Wife, Hindu, R/o. D.No. 24/687, Netaji Nagar, Proddatur, Kadapa District.
7. Gollapudi Venkata Suresh Kumar, S/o. late Gollapudi Sreenivasulu, Aged about 34 years, Hindu, Residing at D.No. 24/686, Netaji Nagar, Proddatur, Kadapa District – 516360.

NOTICE

It is submitted that a Civil Revision Petition bearing CRP No. 2802 of 2015 is filed before the Hon'ble High Court of Andhra Pradesh, at Amaravathi by Manchikanti Pedda Rangaiah Setty and 2 others against the 11 Respondents aggrieved by the order dated 5.6.2015 passed in I.A. No. 611/2015 in OS No.141/2007 on the file of the Court of Senior Civil Judge, Proddatur. Fresh Notice was ordered by the Hon'ble High Court to the Respondents 1 to 11 in the CRP on 28-02-2023 by way of registered post with acknowledgement due. Notice sent to the Respondents No. 1, 2 and 7 was served whereas, notice sent to respondents No. 3, 4, 5, and 8 was 'Returned unserved' as 'left without instructions' and notice sent to the Respondents No. 6, 9 and 11 'Retuned as Died'. It is submitted that we have filed LR application for the Respondents No. 6, 9, and 11 before the Hon'ble High Court and the Hon'ble court was pleased to order notice to the LR's of the Respondent No. 6, 9, 11. Notice sent to the LR of Respondent No.9/proposed respondent i.e., Posa Sai, S/o. Late Posa Mallanna, Aged about 30 years, Hindu, R/o. D. No. 24/685, Netaji Nagar, Proddatur, Kadapa District in I.A. No.'s 1, 2 & 3 is returned with an endorsement on the postal cover as "Addressee left Without instructions hence return to sender". It is submitted that the Respondent No.6 has three LR's and notices sent to the two LR's of the Respondent No.6/Proposed respondents are served and for One Legal Representative i.e., Chintala Suguna, D/o. Late Chintala Babu, Aged about 30 years, House Wife, Hindu, R/o. D.No. 24/687, Netaji Nagar, Proddatur, Kadapa District is retuned with an endorsement on the postal cover as "No Such Addressee hence return to sender" in I.A. No.'s 4, 5 & 7. It is further submitted that the Respondent no.11 has two LR's and Notices Sent to the one LR was Returned as Refused which is deemed service and Notice sent to Another LR i.e., Gollapudi Venkata Suresh Kumar, S/o. late Gollapudi Sreenivasulu, Aged about 34 years, Hindu, residing at D.No. 24/686, Netaji Nagar, Proddatur, Kadapa District – 516360 is returned with the postal cover with an endorsement on it as "Addressee left Without instructions hence return to sender". And a memo of the same was filed in the Hon'ble court. It is submitted that under such circumstances we have filed the Substitute service petition vide I.A. No. 10 of 2023 in CRP No. 2802 of 2015 and the Hon'ble court was pleased to allow the application and Hon'ble court on 12-10-2023 has directed the petitioners to send notice to the above mentioned persons about the pendency of the above mentioned Civil Revision Petition and also about the stage of the case by way of substitute service by way of publishing the notice in local newspaper i.e., Praja Shakthi before 31-10-2023 and posted the matter to 31-10-2023 for arguments. Hence please take notice and appear either in person or through a counsel in the above said writ petition before the Honble High court of Andhra Pradesh on 31-10-2023 and contest the case or else the matter will be decided exparte.

V.NITESH, ADVOCATE